క్లుప్తంగా

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష



పత్తికొండ ఏపీ మోడల్‌స్కూల్ సెంటర్ వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు

పత్తికొండ(తుగ్గలి) : నవోదయ ప్రవేశ పరీక్షను ప్రశాంతంగా నిర్వహించారు. జవహర్ నవోదయాల్లో 2025–26 విద్యా సంవత్సరానికిగాను 6వ తరగతిలో ప్రవేశాలకు శనివారం ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఇందు కోసం పట్టణంలో ఏర్పాటు చేసిన ఏపీ మోడల్ స్కూల్‌లో 240 మంది విద్యార్థులకు గాను 201 మంది, సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో 230 మందికి గాను 188 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు ఆయా కేంద్రాల చీఫ్ అధికారులు విక్టర్ శామ్యూల్, నరేంద్ర తెలిపారు. పరీకా కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారిణి బనవాసి నవోదయ ప్రిన్సిపాల్ పద్మావతి తనిఖీ చేశారు. అర్బన్ సీఐ జయన్న ఆధ్వర్యంలో పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు చేపట్టారు.

ఆలూరు: స్థానిక ఎల్లార్తి రోడ్డు సమీపంలోని ప్రభుత్వ బాలుర1,2 హైస్కూళ్లల్లో శనివారం 6వ తరగతిలో చేరేందుకు జవహర్ నవోదయ పాఠశాలలో చేరేందుకు నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జెడ్పీ హైస్కూల్ 1లో 240 మంది విద్యార్థులకు గాను 201 మంది, జెడ్పీ బాలుర– 2 హైస్కూల్లో 225 మందికి గాను 185 మంది పరీక్షలకు హాజ రయ్యారని పరీక్షల చీఫ్, డిపార్టుమెంట్ అధికారులు కరిబసప్ప, నాగచౌడయ్య, రాధాబాయి, రమణయ్య తెలిపారు. పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ గోవిందు సింగ్, డీఈ విజయ్‌కుమార్ తనిఖీ చేశారు.

శ్రీరంగనాథుడికి పూజలు



మద్దికెర : మండలంలోని పెరవలి గ్రామంలో కొలువైన శ్రీరంగనాథుడికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి తెల్లవారుజామున సుప్రభాత సేవ, బిందెసేవ, అభిషేకం మహామంగళహారతి నైవేద్యం నివేదించారు. అనంతరం శ్రీరంగనాథుడు, శ్రీదేవి, భూదేవి ఉత్సమూర్తులకు పల్లకీ సేవ చేపట్టారు.

దివ్యాంగుల పింఛన్ల తనిఖీ



హాలిగేరలో దివ్యాంగుడిని పరిశీలిస్తున్న వైద్య బృందం

ఆస్పరి: మండలంలోని హాలిగేర గ్రామంలో శనివారం ఎంపీడీఓ గీతావాణి ఆధ్వర్యంలో దివ్యాంగుల పింఛన్లపై వైద్య బృందం కిరణ్‌కుమార్, పద్మజ, బాలకృష్ణ పరిశీలించారు. దివ్యాంగుల పింఛన్లుకు అర్హులా కాదా అని వైద్య బృందం నిర్ణయిస్తుందని ఎంపీడీఓ తెలిపారు.

సీసీ రోడ్లు ప్రారంభం

వెల్దుర్తి: పల్లె పండుగలో భాగంగా పట్టణంలో రూ.35లక్షల, కలుగొట్ల గ్రామంలో రూ.10లక్షల ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను శనివారం పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ప్రారంభించి శిలాఫలకాలు ఆవిష్కరించారు. వడ్డేగేరిలో సుంకులమ్మ అమ్మవారికి పూజలు చేపట్టారు. అంతకు ముందు ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమంలో భాగంగా స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి, ఎన్టీఆర్ కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పీఆర్ డీఈ శేషయ్య, తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మ, ఎంపీడీఓ సుహాసిని, ఏపీఓ లక్ష్మన్న, టీడీపీ మండల అధ్యక్షుడు బలరాం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే

మద్దికెర : ఈనెల 20 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు చేపట్టనున్న కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే సర్వేను విజయవంతం చేయాలని ప్రభుత్వ వైద్యాధికారి రాగిణి అన్నారు. శనివారం మండల కేంద్రంలో జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఆశా, ఆరోగ్య కార్యకర్తలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సీహెచ్‌ఓ నిరంజన్‌బాబు, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా పాల్గొన్నారు.

వెల్దుర్తి: కుష్టు వ్యాధి నిర్ధారణ, నివారణలో వైద్య సిబ్బంది, ప్రజలు భాగం కావాలని గోవర్ధనగిరి వైద్యాధికారులు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ నవీన్‌కుమార్ అన్నారు. శనివారం గోవర్ధనగిరి హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌లో ఈనెల 20 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు జరుగునున్న లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంప్ కార్యక్రమంపై వైద్య, ఆరోగ్య, సచివాలయ సిబ్బందికి, ఆశా, స్వచ్ఛంద వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

షరతులు లేని రుణాలివ్వాలి

దేవనకొండ: కౌలు రైతు కార్డు పొందిన ప్రతి రైతుకు సొంత భూమితో సంబంధం లేకుండా బ్యాంకులు రుణాలు మంజూరు చేయాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తిమ్మయ్య, రైతు సంఘం మండల గౌరవాధ్యక్షుడు వై.కందప్ప డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఏపీజీబీ ఎదుట కౌలు రైతులతో కలిసి ధర్నా చేపట్టారు. అనంతరం బ్యాంకు అధికారికి వినతి పత్రం అందజేశారు.

అనుసంధానం సాధ్యమేనా?

- వ్యవసాయానికి ఉపాధి పథకాన్ని అనుసంధానించాలంటున్న రైతులు
- ఉపాధి హామీ పనులకు వెళ్తున్న కూలీలు
- రబీలో వ్యవసాయ పనులకు కూలీల కొరత
- నియోజకవర్గంలో 67,845 జాబ్ కార్డులు, 1,00,803 మంది కూలీలు

ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానించాలని చాలా ఏళ్లుగా రైతులు, కూలీలు డిమాండ్ చేస్తున్నప్పటికీ ప్రభుత్వాలు చెవికెక్కించుకోవడం లేదు. రబీ సీజన్‌లో పనులు కల్పిస్తుండటంతో వ్యవసాయ పనులకు కూలీలు లభించక రైతులు అవస్థలు పడుతున్నారు. పంటలను పోగొట్టుకోలేక ఇతర ప్రాంత కూలీలకు అధిక కూలి ఇచ్చి పిలిపించుకుని పనులు చేయించుకుంటున్నారు. వ్యవసాయానికి ఈ పథకాన్ని అనుసంధానిస్తే రైతులకు కూలి ఖర్చులతో పాటు కూలీలకు నిత్యం పనులు కల్పించినట్లవుతుంది. ఈ ప్రాంతంలో వలసల నివారణకు కొంత వరకు దోహదపడుతుంది.

మండలాల వారీగా జాబ్ కార్డులు, కూలీల వివరాలు..

మండలం	జాబ్ కార్డులు	కూలీల సంఖ్య
ఆలూరు	10,786	15,444
ఆస్పరి	13,953	21,552
చిప్పగిరి	7,203	10,971
హాలహర్వి	10,180	15,788
హొళగుంద	10,715	15,974



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు



ఆలూరు పొలాల్లో పత్తి విత్తనాలు నాటుతున్న కూలీలు (ఫైల్)

ఆలూరు రూరల్: ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధించాలనే డిమాండ్ చాలా కాలంగా ఉంది. ప్రభుత్వాలు ప్రకటనలు చేస్తున్నాయే తప్ప అమలు చేయడం లేదు. కూలీలు ఉపాధి పనులకు వెళ్తుండటంతో వ్యవసాయ పనులకు కూలీల కొరత ఏర్పడింది. దీంతో కూలి రేట్లు పెరగడంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూలీలను రప్పించుకోవాల్సిన పరిస్థితి. దీంతో సకాలంలో వ్యవసాయ పనులు పూర్తికాక రైతులు ఇబ్బంది పడుతున్నారు.

వ్యవసాయ పనులకు కూలీల కొరత..

ఆలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 67,845 జాబ్ కార్డులు ఉండగా, 1,00,803 మంది కూలీలు నమోదై ఉన్నారు. అందులో రోజూ సుమారు 50 వేల మంది వరకు ఉపాధి పనులకు వెళ్తున్నారు. దీంతో వ్యవసాయ పనులకు కూలీల కొరత ఏర్పడుతోంది. యంత్ర పరికరాలు అందుబాటులోకి వచ్చినప్పటికీ చాలా పనులు కూలీల ద్వారానే చేయించాల్సి ఉంటుంది. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేస్తే ఉపయోగం కలుగుతుందని రైతులు కోరుతున్నారు. తమకు కొంతమేరైనా పెట్టుబడి ఉపశమనం లభిస్తుందంటున్నారు. 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేస్తామని చెప్పినప్పటికీ అమలుకు నోచుకోలేదు. నేటికీ అది హామీగానే మిగిలిపోయింది.

అనుసంధానిస్తే..

నియోజకవర్గంలో మెట్ట పొలాల్లో ఖరీఫ్,రబీ సీజన్లలో రైతులు పత్తి,వేరుశనగ, పప్పుశనగ, కంది, మిరప,జొన్న తదితర పంటలు సాగు చేస్తారు. వ్యవసాయం తప్ప మరే ఆధారం లేదు. అందులో వచ్చిన ఆదాయంతో జీవనం సాగిద్దామనే ఆశతో వడ్డీలకు అప్పులు తెచ్చి వ్యవసాయంలో పెట్టుబడులు పెడుతున్నారు. అయితే ప్రకృతి సహకరించక పోవడం, తెగుళ్లు, దిగుబడికి గిట్టుబాటు ధర లేకపోవడం తదితర కారణాలతో తరచూ నష్టాలలే మిగులుతున్నాయి. పత్తి,శనగ,మిరప సాగు చేసిన రైతులు విత్తనాలు నాటడం, కోతలు,నూర్పిళ్ల తదితర పనుల కోసం ఎకరాలో సాగుకు దాదాపు రూ.30వేల నుంచి 40 వేల వరకు ఖర్చు వస్తుంది. ఉపాధి హామీ పథకానికి వ్యవసాయ రంగాన్ని అనుసంధానం చేస్తే కూలీల కొరతతో పాటు పెట్టుబడి ఖర్చులు కూడా కొంతమేర రైతులకు తగ్గుతాయి. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ఉపాధి హామీని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలని రైతన్నలు కోరుతున్నారు.

రైతులకు ప్రయోజనం



ఉపాధి హామీ పథకానికి వ్యవసాయ రంగానికి అనుసంధానిస్తే రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది. ప్రస్తుతం పంట సాగు రైతులకు భారంగా మారింది. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేస్తున్నప్పటికీ లాభాలు రావడం లేదు. వ్యవసాయ పనులకు ఉపాధి కూలీలను పంపిస్తే కొంత మేర ఖర్చు తగ్గుతుంది. – వీరభద్రి,రైతు,గోనేహాల్

అప్పుల భారం తగ్గుతుంది



రైతులకు పంటల సాగు భారంగా మారింది. వ్యవసాయంపై పెట్టిన పెట్టుబడులు కూడా దక్కక అప్పుల పాలవుతున్నాం. ప్రభుత్వం రైతుల కష్టాలు గుర్తించి ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేస్తే కూలీ ఖర్చయినా తగ్గుతుంది.
– గంగాధర్, రైతు,నిత్రవట్టి.

నిందితుల అరెస్ట్



నిందితుల అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ వెంకటరామయ్య

చిప్పగిరి: ఇటీవల బంటణహాలు గ్రామంలో ఇరు వర్గాల గొడవలో తీవ్రంగా గాయపడి కాజీపురం రామాంజనేయులు మృతి చెందిన కేసులో ఏడుగురు నిందితులను పోలీసులు శనివారం అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ వెంకటరామయ్య నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. రామాంజనేయులు, తలారి సురేష్ దారిలో వేసిన రాళ్ల విషయంలో గొడవ పడ్డారు. ఈ క్రమంలో రామాంజనేయులుపై గడ్డపారలు,కొడవళ్లతో దాడి చేయగా తీవ్రంగా గాయపడగా..కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈనెల 16న మృతి చెందాడు. ఇందుకు కారకులైన తలారి సురేష్, తలారి రామాంజి, తలారి గణేష్, తలారి వంశీ,తలారి కృష్ణమూర్తి, తలారి లక్ష్మీదేవిని శనివారం ఏరూరు, గుమ్మనూరు క్రాస్ వద్ద అరెస్ట్ చేసి రిమాండుకు పంపామని వివరించారు. సీఐ వెంకటచలపతి,ఎస్ఐ సతీష్ కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



పత్తికొండ ఆర్టీసీ డిపోలో మాట్లాడుతున్న సీఐ జయన్న

పత్తికొండ(తుగ్గలి) : వాహనడ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అర్బన్ సీఐ జయన్న అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపోలో శనివారం నిర్వహించిన రోడ్డు భద్రత మాసోత్సవాల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అతివేగం, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం, డ్రంకెన్ డ్రైవ్, ఓవర్ టేకింగ్, రాత్రి సమయాల్లో డిమ్ అండ్ డిప్ లైట్ వేయకపోవడం, ఓవర్ లోడ్, ట్రిపుల్ డ్రైవింగ్, మైనర్లు డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని చెప్పారు. యాక్సిడెంట్స్ వల్ల మృతి చెందిన కుటుంబాలు ఇంటి పెద్ద దిక్కు కోల్పోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గ్యారేజ్ ఇన్‌చార్జ్ కృష్ణమూర్తి, ట్రాఫిక్ ఇన్‌చార్జ్ మాదన్న, ఏడీసీ బాషా, ఆర్టీసీ హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మన్న, డ్రైవర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వెంగళాయిదొడ్డి చెరువును సర్వే చేయించాలి

ఆస్పరి: మండలంలోని వెంగళాయిదొడ్డి చెరువు అన్యాక్రాంతమైందని, చెరువు భూమిని సర్వే చేయించి ఆక్రమణలను తొలగించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని వెంగళాయిదొడ్డి చెరువు, కాలువలను వెంగళాయిదొడ్డి పరివాహక ప్రాంత పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో పరిశీలించారు. గిడ్డయ్య మాట్లాడుతూ ఆయకట్టు చెరువు విస్తీర్ణం 300 ఎకరాలకు గానూ దాదాపు వంద ఎకరాలు అన్యాక్రాంతమైందన్నారు. కొంత మంది అక్రమార్కులు చెరువులో ఇసుకను తరలిస్తూ లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. చెరువుకు సంబంధించిన భూమిలో కొంత మంది ఎకరాకు రూ.10 లక్షలు వరకు ఇసుకను అమ్ముకుంటున్నారని తెలిసిందన్నారు. చెరువు పూర్తిగా నింపితే ఖరీఫ్‌లో వెయ్యి ఎకరాలు, రబీలో 500 ఎకరాలకు నీరు అంతుందన్నారు. ఇసుకను తరలించే వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమితి సభ్యులు విరుపాక్షి, మల్లన్న, వీరభద్రి, వీరేష్, వెంకటేష్, సుంకన్న, హనుమంతు, పెద్ద వీరభద్రి ఉన్నారు.

ఎన్టీఆర్‌కు నివాళి

పత్తికొండ(తుగ్గలి) : తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు వర్ధంతిని శనివారం పత్తికొండలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే కేఈ శ్యాంకుమార్ తన కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం మార్కెట్ కమిటీ వద్ద మూడు రోడ్ల కూడలిలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, అభిమానులు రక్తదానం చేశారు. అనంతరం వృద్ధాశ్రమంలో అన్నదానం చేపట్టారు. అలాగే.. తుగ్గలి మండలంలోని పలు గ్రామాల్లో టీడీపీ శ్రేణులు ఎన్టీఆర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

దేవనకొండ: మండలంలోని గుడిమిరాళ్ల గ్రామానికి చెందిన వెంకటరమణారెడ్డి రెండో కుమారుడైన దివాకర్‌రెడ్డి (21) జీవితంపై విరక్తి చెంది ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం చోటు చేసుకుంది. తండ్రి వెంకటరమణారెడ్డి తెలిపిన మేరకు వివరాలు.. దేవనకొండ టర్నింగ్ వద్ద రెడ్డి హోటల్ పెట్టుకుని వెంకటరమణారెడ్డి జీవనం సాగిస్తున్నాడు. ఈయన రెండో కుమారుడైన దివాకర్‌రెడ్డి ఇంటర్ వరకు చదివి హోటల్ వ్యాపారంలో తండ్రికి చేదోడుగా ఉంటున్నాడు. కొన్ని రోజుల నుంచి తీవ్రమైన వెన్నునొప్పి, డస్ట్ ఎలర్జీ తీవ్రంగా వేధిస్తుండటం, పలుచోట్ల చికిత్స పొందినా నయం కాకపోవడంతో హోటల్ కిచెన్‌లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

ఏప్రిల్ 14న సామూహిక వివాహాలు

హొళగుంద: మండల కేంద్రంలో ఏప్రిల్ 14వ తేదీన అంబేడ్కర్ జయంతి సందర్భంగా సామూహిక వివాహాలు నిర్వహిస్తున్నట్లు కన్నారావు, పంచగుండిగ వెంకటేష్ తెలిపారు. శనివారం వారు పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు పంపాపతి, శేఖర్‌తో కలిసి కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు.

7నుంచి అంతర్రాష్ట్ర కబడ్డీ పోటీలు

హొళగుంద: వచ్చే నెల 7 నుంచి మొదలయ్యే సిద్ధేశ్వరస్వామి ఉత్సవాల్లో భాగంగా 7, 8 తేదీల్లో మండల కేంద్రంలో అంతర్రాష్ట్ర కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తిక్కస్వామి, పవన్, అశోక్, దేవరాజ్, మల్లికార్జున శనివారం తెలిపారు. వారు మాట్లాడుతూ.. పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విజేతలకు వరుసగా..రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల వారు 7న రూ.వెయ్యి ఎంట్రీ ఫీజు చెల్లించి జట్టు పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు సెల్ 8309534550, 78999 66226 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఈ– కేవైసీ చేయించుకోవాలి

మద్దికెర : రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలను నమోదు చేయించుకున్న రైతులు ఈ-కేవైసీ చేయించుకోవాలని ఏఓ రవి తెలిపారు. శనివారం స్థానిక గ్రామ రైతు సేవా కేంద్రం-2 లో ఈ-కేవైసీ కార్యక్రమాన్ని పరిశీలించారు.

ఘనంగా గంధోత్సవం

తుగ్గలి : మండలంలోని నల్లగుండ్లలో వెలసిన మునిస్వామి (హజరత్ సయ్యద్ మునీర్‌బాషా) ఉరుసులో భాగంగా శనివారం రాత్రి గంధోత్సవాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. గంధాన్ని మేళతాళాలతో ఊరేగింపుగా ఊరి చివర ఉన్న దర్గాకు తీసుకెళ్లి దర్గా నిర్వాహకులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

అన్నదానం ప్రారంభం

వెల్దుర్తి: స్థానిక జర్నలిస్టు కాలనీలోని వేంకటేశ్వర, అయ్యప్ప, షిరిడి సాయి ఆలయ సమూహంలో శనివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వాహకులు సుదర్శన్ రెడ్డి, చిరంజీవి, గోపినాథ్, శ్రీధర్ శర్మ, మధు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఇక నుంచి ప్రతి శనివారం అన్నదానం ఉంటుందని చెప్పారు.

భూ సర్వేకు రైతులు సహకరించాలి

మద్దికెర : భూ సర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ హుసేన్‌సాహెబ్ అన్నారు. శనివారం వీఆర్వోల సమావేశం నిర్వహించారు. భూసర్వే జరిగేటప్పుడు రెవెన్యూ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటూ ఆయా గ్రామాల్లో రైతుల వద్దనున్న రికార్డులతో పాటు ప్రభుత్వ రికార్డులు పరిశీలించి నమోదు చేయాలన్నారు. అనంతరం స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా అధికారులు కార్యాలయంలో ఆవరణలో పిచ్చిమొక్కలను, చెత్తను తొలగించారు.

పొలం విషయంలో ఘర్షణ

హొళగుంద: మండలంలోని పెద్దగోనెహాళ్ గ్రామంలో పొలం విషయంలో శనివారం ఘర్షణ జరిగింది. గ్రామానికి చెందిన బొజ్జిరెడ్డి, ప్రేమవర్ధన్ రెడ్డి మధ్య చాలకాలంగా భూ తగాదా కొనసాగుతుంది. ఈ క్రమంలో శనివారం పొలంలో పని చేసుకుంటున్న బొజ్జిరెడ్డికి ప్రేమదవర్ధన్‌రెడ్డి, అతని బంధువుల మధ్య మాటా మాట పెరిగి ఘర్షణకు దారితీసింది. ఈ ఘటనలో బొజ్జిరెడ్డికి గాయాలు కావడంతో ఆయనను బళ్లారికి తరలించారు. అలాగే.. ప్రేమవర్ధన్‌రెడ్డి కుమారుడికి కూడా గాయలైనట్లు సమాచారం. హొళగుంద ఎస్ఐ బాల నరసింహులు మాట్లాడుతూ..విచారణానంతరం కేసు నమోదు చేస్తామని తెలిపారు.

యోగాతో మానసిక ఒత్తిడి దూరం



ఎమ్మెల్యే విరూపాక్షిని సన్మానిస్తున్న దృశ్యం

ఆలూరు: యోగాతో మానసని ఒత్తిడిని నివారించవచ్చని ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి అన్నారు. స్థానిక మెయిన్ బజారులో ఉన్న బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో నిర్వహకురాలు బీటీ పద్మావతి ఆధ్వర్యంలో శనివారం కార్యక్రమం నిర్వహించారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



పత్తికొండ స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కేఈ

పత్తికొండ(తుగ్గలి) : ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధుల బారిన పడకుండా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని ఎమ్మెల్యే కేఈ శ్యాంకుమార్ అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఆర్డీవో భరత్‌నాయక్, సర్పంచ్ కొమ్ము దీపికతో కలిసి పట్టణంలో స్వచ్ఛత ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. నాలుగు స్తంభాల కూడలి రోడ్డుపై చీపుర్లతో ఊడ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో అత్యంత పరిశుభ్ర రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దడానికి 12 నెలలకు 12 థీమ్‌లతో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు రూపొందించారన్నారు. కార్యక్రమాల్లో ప్రజలు ఎక్కువగా భాగస్వాములయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు.అలాగే ఎక్సైజ్ కార్యాలయ ఆవరణలో సీఐ విశ్వేశ్వరరావు, సిబ్బంది స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించి చెత్త చెదారాన్ని తొలగించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సువర్ణలత, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

తుగ్గలి మండలంలో..

ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం విజయవంతం అవుతుందని ఇన్‌చార్జ్ ఎంపీపీ నాగప్ప అన్నారు. శనివారం జొన్నగిరిలో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని పంచాయతీ కార్యదర్శి నారాయణస్వామి, వీఆర్వో కాశీరంగస్వామి, సచివాయల సిబ్బందితో కలిసి నిర్వహించారు.

ఆస్పరి: ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తహసీల్దార్ శివశంకర్ నాయక్, ఎంపీడీఓ గీతావాణి సూచించారు. శనివారం ఆస్పరిలో సర్పంచ్ మూలింటి రాధమ్మ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అధికారులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డీటీ భీమేష్, ఈఓఆర్డీ విజయభాను, పంచాయతీ కార్యదర్శి విజయరాజు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.


హాలహర్వి: ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మండల ప్రత్యేకాధికారి రామాంజనేయులు తెలిపారు. శనివారం మండల కేంద్రంలో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి, స్థానిక అధికారులు చెత్తాచెదారాన్ని ఊడ్చారు.ఎంపీడీఓ వరలక్ష్మి, ఏపీవో చక్రవర్తి పంచాయతీ కార్యదర్శి ఈరన్న, సర్పంచులు మల్లికార్జున, గాదిలింగప్ప, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మద్దికెర : మన ఇళ్లతో పాటు పరిసరాలు కూడా పరిశుభ్రంగా ఉన్నపుడే ఆరోగ్యంగా ఉంటామని ఎంపీపీ అనిత, ఎంపీడీఓ కొండయ్య, తహసీల్దార్ హుసేన్‌సాహెబ్, సర్పంచ్ సుహాసిని అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రధాన బజారులో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాంగంగా పరిసరాలను శుభ్రంగా ఉంచుతామని ప్రతిజ్ఞ చేసి చెత్తను తొలగించారు. ఈఓఆర్డీ మద్దిలేటి స్వామి, ఈఓలు కరుణ, రేణు, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు, ధనుంజయ పాల్గొన్నారు.

కృష్ణగిరి: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత కోసం కృషి చేయాలని తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీఓ మోహన్‌కుమార్, వైద్యాధికారి ప్రదీప్ పిలుపునిచ్చారు. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం బస్టాండ్, పీహెచ్‌సీ ఆవరణలో శ్రమదానం కింద పరిసరాలను శుభ్రం చేశారు. ఈఓఆర్డీ చిన్న లచ్చప్ప, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

హొళగుంద: గ్రామాలలో పారిశుద్ధ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని తహసీల్దారు సతీష్, ఎంపీడీఓ విజయలలిత అన్నారు. శనివారం హొళగుందలో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ఈఓపీఆర్డీ చక్రవర్తి, హొళగుంద పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్, ఆయా కార్యాలయాల సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు. అనంతరం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్కే గిరి, నాయకుడు పంపాపతి ఉన్నారు.

పారిశుద్ధ్య లోపం తలెత్తనీయొద్దు




ఆలూరు చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీఓ భాస్కర్

ఆలూరు రూరల్/ఆలూరు: మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్యలోపం తలెత్తకుండా చూడాలని జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్ సిబ్బందిని సూచించారు. శనివారం ఆయన పత్తికొండ డీఎల్‌పీఓ వీరభద్రప్పతో కలిసి ఆలూరు చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి నెల మూడవ శనివారం స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించాలన్నారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి రోజు ఇంటింటికి వెళ్లి తడి,పొడి చెత్త సేకరించాలన్నారు. మురుగు కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా ఆయిల్ బాల్స్ వేయించాలన్నారు. వీధులు చివరల్లో చెంతకుప్పలు వేయకుండా ప్రజలు సూచించాలన్నారు. ఆలూరు ఈఓపీఆర్డీ ప్రభాకర్ గ్రామ పంచాయతీ సిబ్బంది ఉన్నారు.


ప్రత్యేక పూజలు

ఆస్పరి: మండలంలో హాలిగేర గ్రామ సమీప కొండల్లో వెలసిన కూర్మనారాయణస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కూర్మ నారయణస్వామి, హనుమన్నస్వామికి గంగ పూజ, మంగళహారతులు తదితర పూజలు చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

పైప్‌లైన్ లీకేజీ



దేవనకొండలో వృథాగా రోడ్డుపై పారుతున్న నీరు



పైప్‌లైన్ పగిలిన దృశ్యం

స్థానిక బస్టాండు సమీపంలో కర్నూలు–పత్తికొండ రోడ్డుపై తాగునీటి కోసం గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి వేసిన పైపులైన్ పగిలిపోయింది. దీంతో నీరంతా ప్రధాన రోడ్డుపై ప్రవహిస్తోంది. నిత్యం రద్దీగా ఉంటుండటంతో వాహనాల రాకపోకల సమయంలో ప్రజలు, ప్రయాణికులపై ఆ నీరు పడి ఇబ్బందులు పడుతున్నారు. రెండు రోజుల నుంచి నీరు వృథాగా ప్రవహిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.
– దేవనకొండ

కొనే వారు రాక..

కంబాలపాడు చెరువు కింద మగాణిలోనే వరి గడ్డి కుప్పలు



- మగాణిలోనే వరిగడ్డి
- యంత్రాలతో కోయిస్తుండటంతో కొనుగోలుకు పశుపోషకుల అనాసక్తి

కృష్ణగిరి: ప్రస్తుతం వ్యవసాయం చేయడం ఖర్చుతో కూడుకున్న పని. విత్తనం కొనుగోలు నుంచి పంట ఉత్పత్తులు చేతికందే వరకు అన్ని ఖర్చులే. ఖర్చులన్నీ రావాలంటే పంట దిగుబడులు అమ్మడంతోపాటు పంట నుంచి వచ్చే మేత కూడా అమ్మితేనే ఖర్చుల్లో కొంతైనా అన్నదాతకు అందేది. కానీ కాడెద్దుల భారంతో అన్నదాతలు యాంత్రీకరణ వైపు మొగ్గుచూపడంతో మేతను కొనేవారే కరువయ్యారు. దీంతో ఖరీఫ్‌లో కంబాలపాడు, పెనుమాడ, కూర్మగిరి తదితర చెరువుల కింద సాగుచేసిన వరి పంట గతేడాది నవంబర్‌లో యంత్రాలతో నూర్పిడి చేశారు. రెండు నెలలు అవుతున్నా వరి గడ్డికి కొనేందుకు ఎవరూ రాకపోవడంతో ఇలా మగాణిలోనే వదిలేశారు. ఈ వరి గడ్డి అమ్ముడపోయింటే కోతకు వెచ్చించిన మొత్తమైన వస్తే కొంత ఊరట లభించేదని రైతులు పేర్కొంటున్నారు. సాయం అందేదని రైతులు చెబుతున్నారు.